క్లుప్తంగా

ఫార్మసిస్ట్ దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు

సాక్షి, భీమవరం: స్థానిక కేజీఆర్ఎల్ ఫార్మసీ కళాశాలలో సోమవారం ఫార్మసిస్ట్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ కవల నాగేశ్వరరావు మాట్లాడుతూ అవయవ దానం ద్వారా మరొకరికి ప్రాణభిక్ష పెట్టిన వారమవుతామని అన్నారు. కళాశాల విద్యార్థులు అవయవ దానం ప్రాముఖ్యత, సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.రాఘవ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను పునః ప్రారంభించాలి

పెనుమంట్ర: పాలమూరు గ్రామంలో ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందక ఇబ్బంది పడుతున్నారని, వెంటనే గతంలో నిర్వహించి మూసివేసిన వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం సర్పంచ్ కాకర రాజేశ్వరరావుకు సీపీఎం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. స్పందించిన సర్పంచ్ గ్రామంలో అన్ని ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్లాంట్‌ను పునః ప్రారంభించేందుకు కూడా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

29న మార్టేరులో దుర్గమ్మకు వెండి చీర అలంకరణ

పెనుమంట్ర: మార్టేరులోని పాలకొల్లు రోడ్డులో గల శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి రూ.16 లక్షలు వ్యయంతో తయారు చేసిన వెండి చీరను ఈనెల 29న అలంకరించనున్నట్లు దేవస్థానం కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు చేతుల మీదుగా ఈ అలంకరణ జరుగుతుందని, మధ్యాహ్నం 3గంటలకు దాతలకు వేదపండితులతో ఆశీర్వచనం, చిరు సత్కారం ఉంటుందని పేర్కొన్నారు.

గ్రామాల్లో అన్నసమారాధన

పెనుమంట్ర: గణపతి నవరాత్రులు సందర్భంగా సోమవారం పలు గ్రామాల్లోని గణపతి విగ్రహాల వద్ద స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. బ్రాహ్మణచెర్వు సెంటర్‌లోని వినాయకుని ఆలయం వద్ద సాయినాధ కల్యాణ మండపం అధినేత తేతలి సాయిబాబారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహానికి సోమవారం నిమజ్జనోత్సవం నిర్వహించి సాయంత్రం కల్యాణ మండప ఆవరణలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. వెలగలవారిపాలెం రామాలయం వద్ద వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తాడి రాజారెడ్డి విరాళాలతో ఏర్పాటు చేసిన భారీ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ రెడ్డి యూత్ ఆధ్వర్యంలో ఈనెల 30న గణేశ్ నిమజ్జనోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

లక్ష్మీవెంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

పాలకొల్లు అర్బన్: శ్రావణ శుద్ధ ఏకాదశి సందర్భంగా వాలమర్రు గ్రామంలో వేంచేసి యున్న శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమ పూజలు, అష్టదళ పాద పద్మారాధన పూజలు చేశారు.

అలరించిన ప్రవచనం

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మ ఆలయంలో చిలకలపూడి పాండురంగ ఆస్థాన దేవస్థానం గురువు, చాగంటి కోటేశ్వరరావు శిష్యుడు రవితేజ ప్రవచనం అలరించింది. సోమవారం ఆలయంలో శ్రీకృష్ణుని లీలలు, మహిమలను భక్తులకు ప్రవచించారు. భగవంతుని నమ్మి ప్రార్థించిన వారికి సుఖసంతోషాలు విరాజిల్లుతాయని ప్రవచించి భక్తులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో గోవింద సాయి గీతా సమాజం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే సీఎం జగన్ ధ్యేయం

పెనుగొండ: ప్రజారోగ్యమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఆచంట మండలం పెదమల్లంలో సోమవారం ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఇంటిలోని సభ్యుల ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది.

భయపెడుతున్న వంతెన మార్గం

నరసాపురం: రుస్తుంబాదలో మంగళగుంటపాలెంకు వెళ్ళే వంతెన మార్గం వాహనదారులను భయపెడుతోంది. వంతెన ఎక్కే మార్గంలో ఇరువైపులా కూడా రాళ్లు పైకిలేచి ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డు శిథిలమైంది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సైకిళ్లపై వెళ్లే విద్యార్థులు ప్రతిరోజూ పడిపోతున్నారని స్థానికులు చెప్తున్నారు. అధికారులు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కాపు సామాజిక వర్గానికి అండగా నిలిచిన సీఎం జగన్

పీవీఎల్ నర్సింహరాజు



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు, పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: కాపు సామాజిక వర్గం అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెన్నుదన్నుగా నిలిచారని, కాపులు ఆర్థికంగా బలపడేందుకు కాపునేస్తం ద్వారా కోట్లాది రూపాయలు సహాయం చేస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహరాజు చెప్పారు. కాపు నేస్తం పంపిణీ సందర్భంగా మండలంలోని చినకాపవరంలో కాపు సందడి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తొలుత పీవీఎల్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కాపులందరికీ అన్ని పథకాల్ని వర్తింపజేశారని చెప్పారు. చినకాపవరంలో రూ.10 కోట్ల మేర పథకాల సొమ్ము మహిళల ఖాతాల్లో జమ చేశారని చెప్పారు. కాపునేస్తం ద్వారా 108 మందికి ఖాతాల్లో రూ.15 వేలు జమ చేశారని చెప్పారు. చంద్రబాబు ఒంటరిగా పోటీ చేయలేక పవన్‌తో జత కట్టారని చెప్పారు. తప్పు జరిగితే ప్రశ్నిస్తానని చెప్పిన పవన్ అవినీతిపరుడు చంద్రబాబుతో జత కట్టడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ఖజానాను దోచిన చంద్రబాబుతో పవన్ పొత్తు పెట్టుకోవడంలో ఆంతర్యమేమిటన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాతిరెడ్డి ఆదిలక్ష్మీ, జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను), త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, ఎంపీపీ కఠారి జయలక్ష్మీ, కాపు జేఏసీ నాయకుడు నంద్యాల సీతారామయ్య, నాతిరెడ్డి అన్నవరం, జీ.ధనరాజు, పుప్పాల పండు, నందమూరి సత్యవతి, కత్తుల శ్రీను, కనకదుర్గ పలువురు నాయకులు పాల్గొన్నారు. ఆకివీడులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద పూలు, పండ్ల వర్తకం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని పీవీఎల్ నర్సింహారాజు దర్శించుకున్నారు. సాలిపేటలోని వైఎస్సార్ బీమా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు.

రేపు ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

భీమవరం (ప్రకాశంచౌక్): కాళ్లకూరులోని స్వయంభు వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 27న స్వామివారి హుండీ ఆదాయం లెక్కించనున్నట్టు ఆలయ మేనేజర్ ఎం అరుణ్ కుమార్ తెలిపారు. ధర్మకర్తల మండల సభ్యులు, దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీ లెక్కిస్తామన్నారు.

దేశ సమగ్రతకు కృషి చేసిన దీన్‌దయాళ్

ఆకివీడు: సమాజంలో అట్టడుగున ఉన్న వ్యక్తులకు ప్రయోజనం చేకూరాలన్న ఆశయంతో దేశ సమగ్రతకు కృషి చేసిన స్ఫూర్తిదాత దీన్ దయాళ్ ఉపాధ్యాయ అని బీజేపీ మండల అధ్యక్షుడు నేరెళ్ల పెదబాబు కొనియాడారు. ఉపాధ్యాయ జయంతిని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నూతనంగా నిర్మించిన పార్లమెంట్ భవనంలో మొట్టమొదటి మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేస్తూ 25 మంది మహిళలకు నిత్యవసర వస్తువులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కట్రెడ్డి ఏడుకొండలు, శిరాంప్రసాద్, ఎస్.చిట్టిబాబు, కె.పట్టాభి, ఎస్.మాణిక్యాలరావు, వై.రమ్య, అనురాధ, కె.సత్య పాల్గొన్నారు.

సామూహికంగా ఎలుకలను నిర్మూలిద్దాం



ఉండిలో ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని వివరిస్తున్న వ్యవసాయాధికారి



రాయలంలో ఎలుకల బొరియలను మట్టితో పూడ్చుతున్న దృశ్యం

ఉండి: రైతులంతా సామూహికంగా ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని చేపడితేనే వాటి బెడదను నివారించగలమని మండల వ్యవసాయాధికారి బీ సంధ్య తెలిపారు. సోమవారం మండల వ్యాప్తంగా ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఉండిలోని వరి పొలాల్లో ఎలుకల నిర్మూలనపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు. ముందుగా వరి పొలాలు, చేల గట్లపై బొరియలు గుర్తించి వాటిని మట్టితో పూడ్చి వేయాలన్నారు. సోమవారం మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. తరువాతి రోజు అనగా మంగళవారం మట్టితో పూడ్చివేసిన రంధ్రాలను మరోసారి పరిశీలించాలన్నారు. మట్టితో పూడ్చిన రంధ్రాలు తెరుచుకుని ఉంటే దానిలో ఎలుకలు ఉన్నాయని గుర్తించి దానికి తగిన గుర్తులు పెట్టుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలుకల నివారణ కోసం అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ఉచితంగా అందిస్తున్న బ్రోమోడయోలిన్ (తెల్లమందు)ను రైతులు తీసుకుని మూడో రోజున తెరిచి ఉన్న ఎలుకల రంధ్రాల్లో మందును వేసి పూడ్చి వేయాలని అన్నారు. ఇలా రైతులంతా ఒకేసారి ఈకార్యక్రమం చేపడితే వరి పంటపై ఎలుకల దాడిని అరికట్టవచ్చునని ఆమె అన్నారు. ఎలుకల నివారణకు ఆయా రైతు భరోసా కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని రైతులంతా వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్కరమంలో సచివాలయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎలుకలను సామూహికంగా మట్టుపెట్టాలి

భీమవరం అర్బన్: పంట చేలల్లో ఎలుకలను ఆయకట్టు రైతులందరూ సామూహికంగా మట్టుపెట్టాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ సూచించారు. భీమవరం మండలం రాయలం, తుందుర్రు గ్రామాల్లో సామూహిక ఎలుకలు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం పంట చేలల్లో ఎలుకల బొరియలను మూసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ చేలల్లో ఎలుకలను నిర్మూలించకపోతే పంట నష్టం తప్పదన్నారు. రైతులందరూ ఒకేసారి ఎలుకల బొరియల వద్ద మందు పొట్లం పెడితే, మందుతిన్న ఎలుకులు చనిపోతాయని అన్నారు. అనుమానిత కన్నాలను మట్టితో పూడ్చితే ఎలుకలు ఉంటే కన్నాలు తెరుచుకుంటాయన్నారు. మంగళవారం పంచాయతీలు వద్ద నూకలు, నూనె కలిపిన ఎలుకల మందును పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అసిస్టెంట్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడుతూ అభివృద్ధికి పాటుపడాలి



స్థానిక మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం

ఆకివీడు: సనాతన ధర్మాన్ని కాపాడుతూ ఆలయాల అభివృద్ధికి నూతన పాలక వర్గాలు కృషి చేయాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహారాజు చెప్పారు. స్థానిక మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయ నూతన పాలకవర్గ చైర్మన్‌గా గుర్రం హరనాథ్, డైరెక్టర్లతో దేవస్థానం ఈఓ ఎం.రఘునాథ్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న నర్సింహారాజు మాట్లాడుతూ చైర్మన్ హరనాథ్ ఆలయ అభివృద్ధికి కొన్నేళ్లగా కృషిచేస్తున్నారని చెప్పారు. డైరెక్టర్లను కూడా ఆలయ అభివృద్ధికి చేస్తున్న సేవల్ని గుర్తించి నియమించినట్టు తెలిపారు. చైర్మన్ హరనాథ్ మాట్లాడుతూ పదవికి వన్నె తెచ్చే విధంగా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తూ, భక్తులకు సేవలందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఏఎంసీ చైర్మన్ ఎస్కే. రసూల్ బీబీ, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, తూర్పుకాపు డైరెక్టర్ జగ్గురోతు విజయ్‌కుమార్, పెద్దింటి అమ్మ దేవస్థానం చైర్మన్ బొమ్మారెడ్డి మాధవరెడ్డి పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తరపట్ల మోహన్‌కు అవార్డు



దుబాయ్‌లో అవార్డు స్వీకరిస్తున్న మోహన్

పెనుగొండ: దుబాయ్‌లో వైఎస్సార్ సీపీ ప్రవాసాంధ్ర టీమ్‌లో పనిచేస్తూ సోషల్ మీడియాలో పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు ప్రవాసాంధ్రులకు అందిస్తున్న సేవలకు గానూ కొడమంచిలికి చెందిన తరపట్ల మోహన్ ఏపీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ సజ్జల భార్గవ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఆదివారం రాత్రి దుబాయ్‌లో జరిగిన సోషల్ మీడియా ఆత్మీయ సమావేశంలో ఈ అవార్డును అందుకున్నట్లు మోహన్ వివరించారు. కార్యక్రమంలో ఏపీఎన్ఆర్‌టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్, ఏపీఎస్‌డీసీ చైర్మన్ చల్లా మధుసూధన్ రెడ్డి, ఎన్ఆర్ఐ ప్రభుత్వ సలహాదారులు సత్తి ప్రసన్న సోమిరెడ్డి, యూఏసీ కో ఆర్డినేటర్ అక్రమ్, డైరెక్టర్ ఇలియాస్ పాల్గొన్నారని తెలిపారు. మోహన్‌ను ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకర ఇందిర సీతారామ్, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, ఆచంట సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ, పార్టీ నాయకులు అభినందించారు.

వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలి



పెనుగొండలో తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: శిశు మరణానికి కారణమైన పెనుగొండ సీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ విజయలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేసి తహసీల్దారు గురుమూర్తి రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈనెల 20న చినమల్లంకు చెందిన గర్భిణి మామిడిశెట్టి జ్యోతికి వైద్యం చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని, వైద్యం వికటించడంతో ఎటువంటి రిఫరల్ కార్డు ఇవ్వకుండా బయటకు పంపించడం వలన ప్రయివేటు ఆసుపత్రిలో జాయిన్ చేసుకోలేదని ఆరోపించారు. దీంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించేటప్పటికే విషమంగా మారడంతో తల్లి ప్రాణాలు మాత్రమే నిలిచాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, గుర్రాల సత్యనారాయణ, నాగశెట్టి గంగారావు, నీలాపు ఆదినారాయణ, మాదాసు నాగేశ్వరరావు, ఆర్.వెంకటేష్, షేక్ పాదుషా పాల్గొన్నారు.

వైభవంగా గణపతి నిమజ్జనోత్సవం



ఆకివీడు ప్రధాన సెంటర్‌లో వినాయకుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న యువత

కాళ్ల: గణపతి నవరాత్రులు పురస్కరించుకుని మండలంలో ఆయా గ్రామాల్లో వినాయక నిమజ్జన కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో స్వామివారి విగ్రహాల నిమజ్జనం కార్యక్రమాలు పూర్తి చేయగా కొన్ని గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా సోమవారం దొడ్డనపూడిలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ వద్ద ఏర్పాటుచేసిన 12 అడుగుల గణనాథుని నిమజ్జన కార్యక్రమం వైభవంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజు స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఊరేగింపు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక బృందాలు, తీన్‌మార్‌లు వివిధ మేళా తాళాలతో స్వామివారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు గ్రామంలోని పురవీధులకుండా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వారు గ్రామ పెద్దలు వైఎస్సార్ సీపీ నాయకులు గుండా సాయి, చెన్నం శెట్టి దేవి ప్రసాద్, సయ్యపురెడ్డి శ్రీకాంత్, సంతోషి రూప దంపతులు తదితులున్నారు.

వైభవంగా గణేశ్ పూజలు

ఆకివీడు: వినాయక చవితి ఉత్సవాలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మందిరాల్లో వైభవంగా నిర్వహిస్తున్నారు. స్థానిక వర సిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద హోమం, పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయం వద్ద గణనాథుడికి పూజలు చేశారు. పలు చోట్ల చవితి ఉత్సవ పూజలు కొనసాగుతున్నాయి. స్థానికంగా ఏర్పాటు చేసిన వినాయకుడ్ని సోమవారం ప్రధాన రహదారుల్లో ఊరేగించి, అనంతరం వెంకయ్య వయ్యేరులో నిమజ్జనం చేశారు.

వైభవంగా గణేష్ నిమజ్జనోత్సవం

పాలకోడేరు: గణేశ్ నిమజ్జనోత్సవాలు సోమవారం వైభవంగా, ప్రశాంతంగా జరుగుతున్నాయి. మేళతాళాలత నృత్యాలు చేస్తూ గ్రామాల్లో ఊరేగింపులు నిర్వహిస్తూ గణనాథుడి విగ్రహాలను కాలువల్లో నిమజ్జనం చేస్తున్నారు. అనంతరం దాతల సహకారంతో గణేశ్ మందిరాల వద్ద అన్న సమారాధనలు నిర్వహిస్తున్నారు.

జీవీఎస్‌వీఆర్ఎం స్కూల్‌లో ప్రభాత భేరి



ప్రభాత భేరిలో పాల్గొన్న విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: నా మట్టి నా దేశం ప్రభాత భేరి కార్యక్రమం వల్ల దేశ సమగ్రత, ఐక్యత మరింత బలోపేతం అవుతుందని జీవీఎస్‌వీఆర్ఎం స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాయపూడి భవానీప్రసాద్ అన్నారు. సోమవారం పాఠశాలలో నా మట్టి నా దేశం ప్రభాత భేరి కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ దేశ ప్రజలంతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారన్నారు. ఒకే భారతం, శ్రేష్ట భారతం కోసం దేశం నలుమూలల సేకరించిన మట్టిని అమృతవనంగా సృష్టించబడుతుందన్నారు. జన్మనిచ్చిన తల్లిని, స్వేచ్ఛగా జీవించేందుకు అవకాశం కల్పించిన దేశాన్ని గౌరవించుకునేలా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శశికళ, చంద్రకళ, త్రిమూర్తులు, బొక్కా భవాని దుర్గ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో పర్యటించిన గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పట్టణంలోని పలు వార్డుల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) పర్యటించారు. మున్సిపల్ అధికారులతో మాట్లాడి పల్లపు ప్రాంతాల్లో నిలిచిపోయిన నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే యాళ్లవానిగరువులో నీట మునిగిన పల్లపు ప్రాంతాల్లో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ పంచాయతీ అధికారులతో పర్యటించారు. మురుగు నీరు బయటకు మళ్లించేందుకు తక్షణ ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు (చిన్నా) ఆయన వెంట ఉన్నారు.

అవసరానికి మించి ఎరువులు విక్రయించరాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం రూరల్: రైతుల అవసరాలకు మించి ఎరువులను విక్రయించరాదని వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ ఎరువుల డీలర్లకు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ అధ్యక్షతన ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ పి.మురళీకృష్ణ మాట్లాడుతూ ఎరువుల డీలర్లు ఈ-పాస్ యంత్రం ద్వారానే ఎరువులు విక్రయించాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ఈ-పాస్, భౌతిక నిల్వలకు తేడా ఉండకూడదన్నారు. డిసెంబరు 31వ తేది నాటికి ఎరువుల డీలర్లందరికీ అర్హత ప్రమాణాలు ఉండాలన్నారు. లేదంటే డిసెంబరు 31వ తర్వాత లైసెన్స్‌లు రద్దు చేయడం జరుగుతుందన్నారు. ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

కొంతేరు సొసైటీ శత జయంత్యుత్సవాలకు సిద్ధం

యలమంచిలి: కొంతేరు సొసైటీ ఏర్పడి ఈ ఏడాది డిసెంబర్‌తో 99 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా వచ్చే ఏడాది జనవరిలో సొసైటీ శత జయంతి ఉత్సవాలు చేయాలని మహాజన సభలో నిర్ణయించారు. సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ జక్కంశెట్టి సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మహాజన సభలో ఈ మేరకు తీర్మానం చేశారు. చైర్మన్ బోస్ మాట్లాడుతూ ఈ ఏడాది (2022-23 ఆర్థిక సంవత్సరంలో) సంఘానికి 21.42 లక్షలు నికర లాభం వచ్చినట్లు చెప్పారు. సంఘ కార్యదర్శి మణుగుల శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న పాల వెల్లువ కేంద్రంలో పాలు పోస్తున్న 17 మంది రైతులకు రూ.31 వేలు రుణం మంజూరు చేసినట్లు చెప్పారు. అనంతరం సంఘంలో ఈ ఏడాది మార్చి ఒకటి నుంచి ఆగష్టు 31వ వరకు జరిగిన ఆర్థిక లావాదేవీలను వివరించారు. సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు నిమ్మకాయల సత్యనారాయణ, యల్లమిల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

స్పందనలో 4 అర్జీలు

ఆకివీడు: స్పందన కార్యక్రమంలో 4 అర్జీలు అందినట్లు ఎంపీడీవో కందుల వాణి సోమవారం చెప్పారు. ఆయా అర్జీల పరిష్కారానికి సంబంధిత అధికారులకు పరిశీలనకు పంపినట్లు ఎంపీడీవో చెప్పారు.

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



బాబా వారి ఆలయంలో విరాళం అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాళ్ల: సీసలి గ్రామంలో వేంచేసియున్న షిరిడీ సాయి బాబా ఆలయం శాశ్వత అన్నదాన పథకానికి కాళ్లకూరు వాసి కందుల వెంకట సత్యనారాయణ, సులోచన దంపతులు రూ.1,00,011 విరాళాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్ పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతీదేవి వారి కుటుంబ సభ్యులకు బాబా వారి ప్రత్యేక దర్శనం కల్పించి శేషవస్త్రం, బాబా ప్రతిమ అందజేసి సత్కరించారు.

ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఐఆర్‌కే రాజు

సాక్షి, భీమవరం: స్థానిక బీవీ రాజు కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు న్యూట్రిషియస్ ఫుడ్ ప్రిపరేషన్, వేస్ట్ మెటీరియల్ మోడలింగ్‌ల్లో పోటీలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఐఆర్‌కే రాజు, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ఎస్‌వీ సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ఒక స్వయం సేవా పథకమని ఇతరులకు ఆదర్శంగా చూపించేది గెలుపయితే, ధైర్యంగా చూపించేది సేవమాత్రమేనని చెప్పారు.

ప్రమాదకరంగా డ్రెయిన్

నరసాపురం: పట్టణంలో రాజరాజేశ్వరి థియేటర్‌కు వెళ్లే దారి మలుపులో ఉన్న డ్రెయిన్ ప్రమాదకరంగా ఉంది. డ్రెయిన్‌పై మూత లేకపోవడం, సరిగ్గా మలుపులో గొయ్యి ఉండటంతో అటుగా వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో పలు సినిమా థియేటర్లు, ఆసుపత్రులు ఉండటంతో నిత్యం వందలాది మంది ఇటుగా ప్రయాణిస్తుంటారు. వారంతా భయపడుతూ అడుగులు వేయాల్సిన పరిస్థితి. మున్సిపల్ అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.